రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏడు అసెంబ్లీ సెగ్మెంట్స్ వారిగా కౌంటింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కౌంటింగ్ పరిశీలకులు అనిల్ కుమార్ పాండే, హిమాన్షు కుమార్ గుప్తా ఎస్సీఎస్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషా సమక్షంలో పూర్తి చేశారు. ఈవీఎం పోస్టల్ బ్యాలెట్ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్స్ వారిగా కౌంటింగ్ సిబ్బంది. ర్యాండమైజేషన్ ప్రక్రియలో 14 టేబుల్స్ ముగ్గురు చొప్పున అదనంగా 20 శాతం కలుపుకొని 378 ఈవీఎం కౌంటింగ్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి 65 మంది కౌంటింగ్ సిబ్బంది 17 సీఎస్, 31 సీఏ, 17 ఎంఓలు వీరికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్ డీఈఓ రవీందర్, మూడు జిల్లాల ఈడీఎంలు, కలెక్టరేట్ ఏఓ అరవింద్, టెక్నికల్ మేనేజర్ విలాస్ పాల్గొన్నారు.

రేపు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న పట్టణంలోని టీటీడీసీ కేంద్రం, పాలిటెక్నిక్ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఉన్నందున పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐలవ్ ఆదిలాబాద్ నుండి మావల పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రోడ్డుపై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం నుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు సామాన్య ప్రజలకు అనుమతులు లేవని, ప్రజలందరూ పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని సూచించారు. కేఆర్కే కాలనీవాసులు తిరుమల పెట్రోల్ బంక్ మీదుగా ఉన్న దారిని వాడుకోవాలని పేర్కొన్నారు. హ్యాండీక్యాప్ కాలనీ, ఆర్ఆర్ నగర్ వాసులు సరస్వతీ నగర్ మీదుగా ఉన్న దారులను వాడుకోవాలని పేర్కొన్నారు.

సంబురంగా దశాబ్ది పండగ..!





- ఉమ్మడి జిల్లాలో ఘనంగా రాష్ట్ర అతరణ దినోత్సవం
- జాతీయ జెండా ఎగురవేసిన ఆయా జిల్లాల కలెక్టర్లు
- ఊరూ-వాడ రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరిగాయి. రాష్ట్రం సిద్ధించి పదేండ్లు కావడంతో దశాబ్ది ఉత్సవాలను ఆదివారం అధికారికంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రాలతో పాటు ఊరూ-వాడ త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అధికారిక వేడుకలను ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్లలో నిర్వహించారు. ఆదిలాబాద్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ అశీష్‌సంగ్వాన్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ దౌత్రే, మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌నాయక్‌లు జాతీయ జెండాలు ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాష్ట్ర ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు.





రైతులు ఆందోళన చెందొద్దు

- తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్రకార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు కోరుకునే డిమాండ్ రకం విత్తనాలతో పాటు ఇతర అన్ని రకాల కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాల వద్ద రైతులను కలిసి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ శనివారం రాశి 659 వెరైటీ రకం విత్తనాలు 28వేల ప్యాకెట్లు జిల్లాకు చేరుకున్నట్టు, అలాగే ఆదివారం 30 వేల ప్యాకెట్లు రానున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెల్లడించారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు ఈ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, పోలీసు, వ్యవసాయ అధికారుల సమన్వయంతో పంపిణీ సవ్యంగా జరుగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతున్నలు ఎన్నో బాధలు పడ్డారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదనే తమ కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. చిన్న సన్నకారు రైతులు ఒకే విత్తన వెరైటీపై ఆధారపడకుండా ఎకరాకు ఒక వెరైటీ చొప్పున వేస్తే నష్టపోకుండా ఉండవచ్చునని, ఏ రకం విత్తనం వేసిన దాదాపు ఒక క్వింటాల్ వ్యత్యాసం ఉండవచ్చునని, ఒక రైతుబిడ్డగా చెబుతున్నానని రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చంద్రాల రాహుల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, నాయకులు అడెల్లు, వెంకటేష్, దినేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల త్యాగాలు మరువలేనిది



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరులు, ఉద్యమకారుల త్యాగాలు మరువలేనివని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ దుర్గం రవీందర్, గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వసీం అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు, యువకులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు అనేక పోరాటాలు, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. ఎన్నో ఏళ్ళ కల సాకారం అయిందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బాబూరావు, లక్ష్మణ్, ఉపేందర్, వామన్, వినోద్ జైస్వాల్, గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వసీం, మొయిజ్, శ్రీనివాస్, హుస్సేన్, సుగ్రీవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గుండి ప్రజల కష్టాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రం నుండి గుండి గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న పెద్ద వాగుపై గత వేసవికాలంలో నాయకులు గుండి ప్రజలు కలిసి తాత్కాలిక రహదారి పైపులతో నిర్మించుకున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి వాగు ఉప్పొంగడంతో వంతెన కొట్టుకుపోయింది. గ్రామస్తులకు వర్షాకాలం కంటే ముందే కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనైనా వంతెన పూర్తి చేయాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



నవతెలంగాణ- దహేగాం

గెలుపోటములు సమానంగా తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు రూ.5000నగదు బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడి మాయం చేస్తాయన్నారు. క్రీడాకారులకు యువ నాయకుడు తిరుపతి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీబ్రా బోర్లకుంట కొత్మీర్ దుబ్బాగూడ క్రీడాకారులు పాల్గొన్నారు.

పోడుభూముల జోలికొస్తే అటవీ అధికారులను బంధిస్తాం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పోడు భూముల జోలికి వస్తే అటవీ అధికారులను ఎక్కడికక్కడ బంధిస్తామని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అటవీ అధికారుల వేధింపులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు పోడు రైతులకు అండగా ఉంటామని చెప్పిందని ఇప్పుడు అదే రైతులపై దాడులు చేయిస్తుందన్నారు. అటవీ అధికారులు తమ అత్యుత్సాహాన్ని ఆపకుంటే జిల్లాలో వారిని తిరగనియ్యమని హెచ్చరించారు. అలాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జిల్లాలో విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. రైతులకు నమ్మకం ఉన్న పత్తి, వరి విత్తనాలు కొరత లేకుండా చూడాలన్నారు. తూర్పు తెలంగాణలో ఎరువుల కొరత లేకుండా చేయడానికి రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని, విత్తనాల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందన్నారు. రైతులకు అండగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ నిరసనకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు వెనుకబడ్డాయన్నారు. ప్రజలకు అండగా నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని, జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అవినీతి రహిత పాలన కోరుకున్న ప్రజలు మరోసారి బీజేపీకి పట్టం కట్టడం కాయమన్నారు. చిన్న రాష్ట్రాలకు బీజేపీ అనుకూలం కావడంతోనే తెలంగాణ రావడం సాధ్యమైందన్నారు. జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 70,000 ఓట్లు రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు కిరణ్, ప్రసాద్ గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

సాధించిన తెలంగాణకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పాలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువకులు, విద్యార్థులు ఏ ఆకాంక్ష కోసం ఉద్యమించి తెలంగాణ సాధించారో.. దానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో పదేండ్ల పాటు బీఆర్ఎస్ పాలన సాగించిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూజలు చేసి, జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్రం వస్తే బతుకులు బాగుపడుతాయని ఆనాడు ఉద్యమంలో అన్ని వర్గాలు వారు ఉద్యమించారని తెలిపారు. కానీ అమరుల త్యాగాలతో ఏర్పాడిన తెలంగాణలో గత ప్రభుత్వం ప్రజా సమస్యలు వదిలి కుటుంబ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ కోసం సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో పోరాటం చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ కూడా సుష్మా స్వరాజ్ సేవలను మరిచిందన్నారు. ప్రజల కలలను సకారం చేసే దిశగా నూతన కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, దినేస్ మటోలియ, ధోని జ్యోతి, సునందరెడ్డి, రాజేష్, భీంసేన్‌రెడ్డి, వేదవ్యాస్ ఉన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి పునరంకితం అవుదాం

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు అభివృద్ధికి ప్రతి ఒక్కరు పునరంకితమవ్వాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అమరవీరుల స్థూపానికి నివాళ్లు అర్పించి, జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై ప్రగతి నివేదికను తన ప్రసంగం ద్వారా వివరించారు. జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధించే దశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన ప్రతి ఒక్కరికి నివాళులు అర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని లక్ష్యంతో వినూత్న పద్ధతులు అవలంబించనున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, యువ వికాసం లాంటి పథకాలతో సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టు వివరించారు. దేశ ప్రగతికి విద్య అవసరమని ఆదిశగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గొరిల్లా యుద్ధం చేసి ఆదివాసులకు అండగా నిలిచిన కుమురంభీం జిల్లాకు చెందిన వాడు కావడం గర్వకారణమన్నారు. తమ సంస్కృతి సాంప్రదాయాలలో వైవిధ్యతను చాటే గిరిజనులు తమకే సొంతమైన గుస్సాడి నృత్యంలో పద్మశ్రీ అవార్డు పొంది జిల్లా పేరును దేశంలో నిలిపారని కొనియాడారు. జిల్లాలో ఎన్నికలు అద్యంతం ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరు ఎంతగానో కృషి చేశారని అందరికీ అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరు పునరంకితం కావాలని కోరారు. అనంతరం సిబ్బందితో కలిసి ఫోటో సెషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ఏఎస్పీ ప్రభాకర్ రావ్, ఆర్డీవో లోకేశ్వర్ రావ్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉదయం ఉక్కపోత మధ్యాహ్నం గాలివాన

- జిల్లా కేంద్రంలో ఈదురుగాలులతో వర్షం
- తెగిన కరెంటు వైర్లు లేచిపోయిన ఇంటి పైకప్పులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో ఆదివారం విచిత్రమైన వాతావరణ కనిపించింది. ఉదయం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో విపరీతమైన ఉక్కపోతతో అధికారులు వేడుకలు చూడడానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతం వరకు వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటుచేసుకుంది. విపరీతమైన ఈదురుగాలులు రావడంతో మండలంలోని జెండాగూడా గ్రామాల్లో పలు ఇండ్లపై రేకులు లేచిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభించిపోయింది. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణతోపాటు పలుచోట్ల నీళ్ల నిలిచాయి. ఏదేమైనా ఒక్కసారిగా వర్షం రావడం వాతావరణం కొంత చల్లబడడంతో గత కొద్ది రోజులుగా విపరీతమైన ఎండలతో ఇబ్బందులు పడ్డ జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మైనార్టీ గురుకులంలో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల కళాశాల-2లో ప్రస్తుత విద్యాసంవత్సరం నుండి వృత్తి విద్యా కోర్సులు ప్రారంభిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమాదేవి, ఆర్ఎల్‌సి గుల్బం శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టి) కోర్సులో మైనార్టీలకు 23 సీట్లు, ఇతరులకు ఏడు సీట్లు కేటాయించామని, కంప్యూటర్ గ్రాఫిక్స్ యానిమేషన్ (సీజీఏ) కోర్సులో మైనార్టీలకు 30 సీట్లు, ఇతరులకు పది సీట్లు కేటాయించినట్లు వారు పేర్కొన్నారు. కోర్సులలో చేరేవారికి ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులు కావడంతో కోర్సులు పూర్తయిన వెంటనే ఉద్యోగావకాశాలు ఉంటాయని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పాసైన విద్యార్థులు పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపల్ జబ్బార్ (9441048858)ను సంప్రదించాలని సూచించారు.

పాము కాటుతో మహిళ మృతి

నవతెలంగాణ-కెరమెరి



పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై గుంపుల విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుర్ధపూర్ గ్రామానికి జాహిద శనివారం ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా అర్థరాత్రి 1గం ప్రాంతంలో ఎడమ కాలి వేలు పై గుర్తు తెలియని పాటు కాటు వేసింది. పాము కాటు వేసిన విషయాన్ని భర్త రసూల్‌కు చెప్పగా వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం 3గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు తెలిపారు.మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాన-దహేగాం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కంబాగోనిసులోచన జడ్పీటీసీ శ్రీరామరావు, ఎంపీడీఓ రాజేందర్, తహసీల్దార్ కవిత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | జూన్ 03, 2024 | www.navatelangana.com

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కడెం



మండలంలోని అంబారిపేట్ ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న 2009-10 బ్యాచ్ పదో తరగతి సభ్యులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కొండుకూర్‌లోని ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముందుగా వారితో పాటు చదువుకున్న మిత్రులు గతంలో మరణించడంతో వారికోసం ఒక నిమిషాము పాటు మౌనాన్ని పాటించారు. వారు చిన్ననాటి జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని సొంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కృష్ణ కుమార్ తల్లి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అమూల్, నాయకులు మాణిక్ రావ్, రాము, విలాస్, కేశవ్ పాల్గొన్నారు.

సోనియా గాంధీకి తెలంగాణ ప్రజలు రుణపడి ఉంటాం

- తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అమరవీరుల ఆశయ సాధనకోసం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి యావత్ తెలంగాణ ప్రజానీకం రుణపడి ఉంటుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మావల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ చౌక్ లోని అమరవీరుల స్థూపం వద్ద, ఆచార్య జయశంకర్ సార్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చంద్రాల రాహుల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, నాయకులు అడెల్లు, వెంకటేష్, దినేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జొన్న పంట దగ్ధం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన ఒడ్డం బాబు రైతుకు సంబంధించిన జొన్న పంట ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధమైంది. రైతు బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తన కున్న 3ఎకరాల్లో రబీ సీజన్‌లో జొన్న పంటను సాగుచేశాడు. పంట కోతకు రావడంతో కూలీలతో జొన్నను కోతకోసి ఒక్కదగ్గర కుప్ప వేశారు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చారు. అనంతరం జొన్న పంటకు నిప్పు అంటుకొని దగ్ధం అయ్యింది. దిన్ని చూసిన చుట్టు పక్కల ఉన్న రైతులు గమనించి, వెంటనే రైతుకు సమాచారం అందించారు. వెంటనే ఆ రైతు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూసే సరికి జొన్న కుప్ప కాలీ బూడిద కావడంతో రైతు పూర్తిగా చేతికి వచ్చిన పంట కండ్ల ముందు కాలిపోవడం చూసి కంటతడి పెట్టారు. దీంతో రైతు దాదాపుగా రూ.1లక్ష నష్టం జరిగినట్టు రైతు తెలిపారు. దీంతో అధికారులు పంట క్షేత్రాన్ని పరిశీలించి, నష్టపోయిన రైతుకు నష్టపరిహారం అందేలా చూడాలని అన్నారు.

బీటీ 659 పత్తి విత్తనాల పంపిణీ



నవతెలంగాణ-తాంసి

బీటీ 659 పత్తి విత్తనాలను ఆదివారం తాంసి, భీంపూర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ అనుమతి లైసెన్స్ పొందిన సీడ్స్ పెస్టిసైడ్ దుకాణాలలో వ్యవసాయ శాఖ అధికారులు తహసీల్దార్ల పోలీస్ సిబ్బంది సమక్షంలో రైతులకు పత్తి విత్తనాలను ఒక్కరికి నాలుగు ప్యాకెట్ల చొప్పున పంపిణీ చేశారు. రైతులు పట్టా పాస్ బుక్ ఆధార్ కార్డు ఉన్న రైతులకు మాత్రమే పంపిణీ చేశామన్నారు. ఉదయం ఏడు గంటలకు రైతులు సీడ్స్ పెస్టిసైడ్ దుకాణాల వద్దకు చేరుకొని లైన్‌లో నిలుచొని విత్తనాల ప్యాకెట్లు తీసుక వెళ్లారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా తాంసి, భీంపూర్, ఎస్సైలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని ఒకే పత్తి విత్తనంపై ఆధారపడకుండా ప్రభుత్వం అనుమతి పొందిన పత్తి విత్తనాలను తీసుకోవాలని అన్నారు.

అమరవీరుల స్థూపానికి ఘన నివాళ్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సాధన రాష్ట్రలో అమరుల త్యాగలను స్మరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఎన్టీఆర్ చౌక్‌లోని అమరవీరుల స్థూపానికి ఘన నివాళులర్పించారు. పుష్పాంజలి సమర్పించి, వారి త్యాగాలను కొనియాడారు. అక్కడి నుంచి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే పాయల శంకర్ అమర వీరుల స్థూపానికి నివాళులర్పించారు. అంతకు ముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి ఆర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, బీజేపీ నాయకులు లాలామున్న, వేదవ్యాస్, ముకుంద్, రాజేష్, భీంసేన్ రెడ్డి, దినేష్ మటోలియ, ధోని జ్యోతి పాల్గొన్నారు.



నకిలీ విత్తనాలకు చెక్

- ముమ్మరంగా కొనసాగుతున్న తనిఖీలు



నవతెలంగాణ-నార్నూర్

ఎన్నో ఆశలతో అన్నదాతలు వానకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. రైతులు ముందస్తుగా విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో బిజీ అయ్యారు. దీనిని ఆసరాగా చేసుకొని, దళారులు ఆశ చూపి రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. ఈ క్రమంలో అధికార యంత్రాంగం అప్రమతమై నకిలీ విత్తనాలు కట్టడికి చెక్ పెడుతున్నారు. జిల్లా, మండలాల్లో ఇప్పటికే వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో తనిఖీ ముమ్మరంగా చేస్తున్నారు. విత్తన దుకాణంతో పాటు సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘా ఉంచారు. ఉమ్మడి నార్నూర్ గాదిగూడ మండలంలో రైతులు అధిక శాతం వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. వ్యవసాయ పంటలో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. ఈ ఏడాది వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారని వ్యవసాయ అధికారుల అంచనా. దీనితో దళారుల ధనార్జనే ధ్యేయంగా జిల్లాలో కొన్ని చోట్ల నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. మంచి విత్తనాల కంపెనీ కంటే నాణ్యత మైనవి. కలుపు నివారణ కోసం మందు పిచికారి చేస్తే సరిపోతుందని నమ్మించి అమాయక అన్నదాతలకు అంటగట్టి నిండా ముంచుతున్నారు. వీటికి నాటిన రైతులు పంటల దిగుబడి రాక ప్రతి ఏడాది నష్టాల పాలవుతున్నారు. దీనితో నకిలీలను ముందు గానే అరికడితే రైతుల చెంతకు చేరకుండా ఉంటాయని భావించిన అధికారులు ప్రత్యేకంగా విత్తన దుకాణాలపై నిఘా ఉంచుతున్నారు. తరుచూ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని విత్తనాలతో పాటు నకిలీని గుర్తిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలను సరఫరా కాకుండా అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. నకిలీ విత్తనాలు ఎరువులు మందులు పట్టు బడితే వారి కేసు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

విత్తనాలపై రైతులకు గ్రామాల్లో అవగాహన..

విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని గ్రామాల్లో ఏఈఓలు విస్తృతంగా పర్యటించి, అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సీడ్స్‌ను మాత్రమే వాడాలని సూచిస్తున్నారు. లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ వద్ద నుండే మాత్రమే కొనుగోళ్ల చేసి, రశీదు భద్రపరచి ఉంచాలని కోరుతున్నారు.

నకిలీపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం

గాదిగూడ మండల వ్యవసాయ అధికారి జాడి దివ్య



గాదిగూడ మండలంలో నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా ప్రత్యేక నిఘా పెడుతున్నాం. విత్తన దుకాణాలను ముమ్మరంగా పరిశీలిస్తున్నాం.

రెండు, మూడు సంవత్సరాల నుంచి ఇతర రాష్ట్రం సరిహద్దు ప్రాంతం నుంచి మండలంలో నకిలీ విత్తనాలు ఎరువులు, మందు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటూన్నాం.

గ్రామాల్లో రైతులకు అవగాహన

నార్నూర్ వ్యవసాయ అధికారి రమేష్



రైతులు దళారులను ఆశ్రయించి, విత్తనాలు కొని మోస పోకుండా ఉండేందుకు గ్రామాల్లో ఏఈఓలతో కలిసి విస్తృతంగా పర్యటించి, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. లైసెన్సు కలిగి ఆన్న డీలర్ వద్దనే సీడ్స్ కొనుగోళ్లు చేసి, రశీదు భద్రపరచి ఉంచాలనీ, గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే పోలీసు శాఖ, లేదా వ్యవసాయ శాఖకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరుతున్నాం.

ప్రజలందరి భాగస్వామ్యంతో అభివృద్ధికి పాటుపడుదాం





నవతెలంగాణ-నిర్మల్

ప్రజలందరి భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధికి పాటుపడదామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్‌లతో కలిసి అమర వీరుల స్తూపానికి నివాళు లర్పించారు. ఆ తర్వాత పోలీసులు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ తీరును గుర్తు చేస్తూ, స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమర వీరులందరికీ ఘనంగా నివాళులు అర్పించారన్నారు.. త్యాగధనులందరూ ప్రదర్శించిన ఉద్యమ స్ఫూర్తి మరువలేనిదని, వారందరి పోరాటాల ఫలితమే నేడు మనకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకునే భాగ్యం కలిగిందని అన్నారు. ప్రతీ ఒక్కరూ అంకితభావంతో జిల్లా, రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పలువురు విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు అందజేశారు. ఈ వేడుకల్లో ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఈఓ రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కళాకారులు, విద్యార్థులు, ఉద్యమకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో ...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం, గాంధీ పార్క్, మినీ ట్యాంక్ బండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయం ముందర ఉన్న అమరవీరుల స్థూపానికి తెలంగాణ తల్లి, ప్రొపెసర్ జయశంకర్ చిత్రపటాలకు, గాంధీ పార్క్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమాల్లో పురపాలక సంఘం పాలకవర్గం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వచ్చిన విత్తనాలు.. తగ్గిన రద్దీ..

- కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం
- పట్టణంలో సీడ్స్ షాపుల సందర్శన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో పత్తి రైతులు కోరుకున్న రాశీ 659 పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, మండలాల వారీగా విత్తనాలు లభ్యమవడంతో రద్దీ కూడా తగ్గిందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం జిల్లాకు రాశీ 659 పత్తి విత్తనాలు రావడంతో జిల్లా ఎస్పీ గౌస్ అలంతో కలిసి దుకాణాలు, గోదాంలను తనిఖీ చేశారు. క్యూలైన్‌లో నిలుచున్న రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా టెంట్లు, నీటి సౌకర్యం కల్పించారు. వీటి గురించి కలెక్టర్ ఎస్పీ ఆరా తీసి రైతులతో మాట్లాడారు. గోదాం, దుకాణాల్లోని రిజిస్ట్రార్లను సరిచూసి పలు సూచనలు చేశారు.

27 వేల ప్యాకెట్లు వచ్చాయి...

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ కొన్ని రోజులుగా రైతులు ఒకే పత్తి రకం విత్తనాల కోసం బారులు తీరారన్నారు. వారికి అవసరమైన కోరుకున్న విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఆదివారం 27 వేల ప్యాకెట్లు రావడంతో మండలాల వారీగా రైతులు కొనుగోలు చేసేలా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. దానికారణంగా రైతులు రద్దీ తగ్గిందన్నారు. విత్తనాల దుకాణాల్లో ఏఈఓలు ఉంటారని, ఎలాంటి సందేహాలున్న నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా మార్కెట్‌లో అనేక రకాల మేలైన రకం పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఒకే రకంపై ఆధారపడకుండా ఇతర విత్తనాలను కూడా వాడాలని కోరారు. డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెట్ తరలిపోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. సరిహద్దు చెక్‌పోస్టులో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగంతో కలిసి పోలీసులు కూడా విత్తనాల దుకాణాలు, గోదాములను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హైదరాబాద్ వెళ్లిన ముథోల్ ఉద్యమకారులు

నవతెలంగాణ-ముథోల్

రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు తెలంగాణ దశాబ్ది వేడుకలకు ముథోల్ నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో నిర్మల్ జిల్లా ఉద్యమకారులతో కలిసి వెళ్లారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఉద్యమకారులకు పంచాయతీ రాజ్ సీఈఓ గోవింద్ వేడుకల్లో పాల్గొనేందుకు పాస్‌లను జారీ చేశారు. ఈ వేడుకల్లో నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ముష్కం రామకృష్ణగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సలహాదారులు రోళ్ళ రమేష్, ఉద్యమ కవి, రచయిత జాధవ్ పుండలిక్ రావు పాటిల్, జిల్లా నాయకులు శ్రీనివాస్ రాజు, నియోజకవర్గం నాయకులు శ్రీనివాస్ యాదవ్, పి.సురేష్ పాల్గొన్నారు.

పోరాటాల, త్యాగాల ఫలితంగానే సిద్ధించిన రాష్ట్రం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నో పోరాటాల, అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్ర సాధించబడిందని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ గౌస్ ఆలం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మొదటగా సాయుధ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించి, ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రం సిద్ధించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా ప్రజలకు, సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం సిబ్బందికి మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే సభ్య సమాజ అభివృద్ధి జరుగుతుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి అప్రమత్తతతో పోలీసు యంత్రాంగం 24 గంటలు విధులను నిర్వర్తిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్ జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సీఐలు రమాకాంత్, శ్రీనివాస్, సీసీ దుర్గం శ్రీనివాస్, ఎస్సై అన్వర్ ఉల్ హక్, ప్రజా ఫిర్యాదుల విభాగము అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ సర్వే పనులు పరిశీలన



నవతెలంగాణ-జైనథ్

బోరజ్ నుంచి బేల మండల సరిహద్దులోని మహారాష్ట్ర వరకు చేపడుతున్న నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తరోడా బ్రిడ్జి వద్ద నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ సర్వే పనులను ఆయన పరిశీలించారు. తరోడ బ్రిడ్జిపై నీటి సరఫరా లైన్ ఉండటంతో పాటు ఎన్నికల కోడ్ ఉండటం వల్ల నేషనల్ హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో ఆలస్యం అయిందన్నారు. సంబంధిత నేషనల్ హైవే అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశం పూర్తయిందన్నారు. వర్షాకాలంలో సైతం రాకపోకలు కొనసాగే విధంగా తరోడ బ్రిడ్జి పక్కనుంచి మూడు కోట్ల నిధుల వ్యయంతో డైవర్షన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రపోజల్ పంపుతామన్నారు. గతంలోని ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసిన రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పనులు ప్రారంభమై కార్యరూపం దాల్చే విధంగా కృషి చేస్తామన్నారు. కుంగిపోయినటువంటి తరోడ బ్రిడ్జి తీసేసి నూతన బ్రిడ్జి నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట అశోక్ రెడ్డి, గజానంద్ ఉన్నారు.

ఆదివాసులపై సైనిక బలగాల హత్యకాండను ఖండిద్దాం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదివాసులపై కేంద్ర, రాష్ట్ర సైనిక బలగాల హత్యకాండను ఖండిద్దామని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాణ అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. ఆదివారం కుమురంభీమ్ కాలనీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో చత్తీస్‌ఘడ్ ఆదివాసులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సైనిక బలగాల హత్యకాండను ఖండించి, ఆదివాసులకు అండగా నిలబడదామని ఆదివాసులకు సంఘీభావ సభ నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దీనికి దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసామికవాదులు, మేధావులు, బుద్ధి జీవులు, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక కర్షక వర్గాల ప్రజలు జర్నలిస్టులు ఆయా రాజకీయ పార్టీలు వామపక్ష పార్టీలు ఖండించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆదివాసీ చట్టాలను, హక్కులను ఆదివాసులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షులు పాణి విరసం పద్మ కుమారి, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, బీఎస్పీ సీనియర్ నాయకులు గద్దల శంకర్, అడ్వకేట్ రహీం, తుడుం దెబ్బ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమ్ర శ్యామ్ రావు, ఐటీడీఏ డైరెక్టర్ కుర్సెంగా తనాజీ, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, జిల్లా సహాయ కార్యదర్శి సోయం లలిత, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, జై యువశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెస్రం ఆనంద్, తెలంగాణ స్టూడెంట్ ఫోరం జిల్లా అధ్యక్షులు బి.రాహుల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు చరణ్ గౌడ్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | జూన్ 03, 2024 | www.navatelangana.com

మండల కేంద్రంలో భారీ వర్షం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



వేసవి కాలంలో ఎండవేడిమికి ప్రజలు అల్లాడుతుండగా, మండల కేంద్రంలో వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. ఆదివారం మండల కేంద్రంలో ఈదురు గాలులతో, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

పిడుగు పాటుకు పది మేకలు మృత్యువాత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బెల్గాం గ్రామంలో నారే హనుమంతుకు చెందిన పది మేకలు పిడుగు పాటుకు గురై మృత్యువాత పడ్డాయి. దాదాపు లక్ష యాభై రూపాయల విలువగల మేకలు పిడుగు పాటుకు గురికావడంతో బాధితుడు కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కాగజ్‌నగర్ లో ఈదురుగాలుల బీభత్సం



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వాన బీభత్సం సష్టించింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండతో ఉక్కిరిబిక్కిరైన జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండ వేడిమికి సతమతమైన జనం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. కాగా మండలంలోని రాస్పెల్లి, సార్యాల, నామనగర్ గ్రామాల్లో ఈదురుగాలుల దాటికి పలువురి ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. ఆరెగూడ గ్రామానికి చెందిన వగాడె అనీల్ ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. ఖేడ్వాయి-ఈజ్గం ప్రధాన రహదారిపై గాలిదాటికి చెట్లు నేలకొరిగాయి. దీంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కేసీఆర్ ద్వారానే తెలంగాణ సాధ్యమైంది

నవతెలంగాణ- రెబ్బెన

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాట పటిమ ద్వారానే తెలంగాణ సాధ్యమైందని మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు అన్నారు. ఆదివారం గోలేటిలోని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయం ముందు జాతీయ జెండా ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్‌రాజ్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ తోట లక్ష్మణ్, పంబాల శ్రీనివాస్, కుమ్మరి మల్లేష్, ఖైరిగుడ టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి వెంకటేష్, ఓరం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ- కౌటాల

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆదివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సాయి కృష్ణ, పశు వైద్యాధికారి కార్యాలయంలో వైద్యుడు శ్రీకాంత్, సహకార సంఘం కేంద్రంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, పోలీస్ స్టేషన్లో ఎస్సై మధుకర్, ఐకెపిలో ఏపిఎం ముక్తేశ్వర్, మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ సోమయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మేనేజర్ నరసింహస్వామి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్, రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్, తహసీల్దార్ కార్యాలయంలో ఇందారపు పుష్పలత జాతీయ జెండా ఆవిష్కరించారు.



ఆసిఫాబాద్ : ఆర్డీఓ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న అధికారులు

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఆదివారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. స్థానిక సర్‌సిల్క్‌లోని ఎమ్మెల్యే నివాసంతో పాటు తెలంగాణ తల్లి చౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, వీరభద్రచారి, దోని శ్రీశైలం, గోలెం వెంకటేష్, గజ్జల లక్ష్మణ్ పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక రాజీవ్‌చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్‌హుసేన్; లెండుగురె శ్యాంరావు, గోగర్ల కన్నయ్య, నక్క మనోహర్, అహ్మద్ పాషా, పిల్లల తిరుపతి పాల్గొన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాల పునాదులే నేటి తెలంగాణ ఆవిర్భావమని ఈ సందర్భంగా అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో అధ్యక్షులు ఎంఎ జయదేవ్ జెండావిష్కరణ చేపట్టారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లి రాజయ్య, అంబాల ఓదేలుతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

- ఎగిరిన ముువ్వెన్నల జెండా
- అమరులకు ఘన నివాళి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్రం సాధించి పది వసంతాలు పూర్తి చేసుకొని 11 వసంతంలో అడుగుపెడుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆర్భాటలు లేకున్నప్పటికీ జెండా ఆవిష్కరణలు కొనసాగాయి.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుని ఇంటి వద్ద జెండా ఆవిష్కరించి, అనంతరం తెలంగాణ తల్లికి నివాళులు అర్పించి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్ మసాడే నాయకులు పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయంలో

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సురేష్ కుమార్ జెండా ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, పట్టణ సీఐ సతీష్ పోలీస్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యాలయంలో

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రహ్లాద్, డైరెక్టర్లు విజయలక్ష్మి, దావు, శంకర్, దేవన్న, సీఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్యాలయంలో

స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇన్స్పెక్టర్ సారంగపాణి, సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పెరిక శ్రీకాంత్ అధ్యక్షులు మాట్ల రాజుతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



డీపీఓ కార్యాలయంలో



జర్నలిస్టుల ఆధ్వర్యంలో..



ఎంఆర్‌వో కార్యాలయంలో



మున్సిపాలిటీ కార్యాలయంలో



పీఏసీఎస్ కార్యాలయంలో



పరుసురంబన స్కూల్‌లో

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ- రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవి ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. సాయంత్రం తెలంగాణ రన్ నిర్వహించారు. జీఎం రవిప్రసాద్ మాట్లాడుతూ సమిష్టి కృషితో బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తిలో ముందుకెళ్లడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటిసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షులు పత్యం రాజబాబు, టీబీజీకేఎస్ ప్రెసిడెంట్ మాల్రాజ్ శ్రీనివాసరావు, ఏజీఎం తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు జాతీయ జెండాను ఎగరవేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో, వాంకిడి గ్రామ పంచాయతీలతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్, వైస్ చైర్మన్ కొట్నాకే నేతాజీ, సంఘం డైరెక్టర్లు సీతారాం, గొల్ల, డిగంబర్, యువజన సంఘం నాయకులు ప్రశాంత్, రవి, సంఘం శ్రీను పాల్గొన్నారు.

పెంచికల్ పేట్ : మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలల్లో మన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జాజిమొగ్గ సుజాత, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కొమురయ్య, రైతు వేదిక వద్ద ఏఈఓ లావణ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆశ్రిన్, ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో రేంజర్ సుధాకర్, ఎంఈఓ కార్యాలయంలో విద్యాధికారి రమేష్ బాబు, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ కవిత పాల్గొన్నారు

చింతలమానేపల్లి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలం తహసీల్దార్ కార్యాలయంలో నాగరాజ్‌గౌడ్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేష్, మండల కార్యాలయంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఎంపీడీఓ కోట ప్రసాద్, జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టోంబ్రే మారోతి, సయ్యద్ నాజీమ్ హుస్సేన్, డుబ్బుల వెంకన్న, టోంబ్రే శ్రీనివాస్, సురేష్, రామగోని నిలగౌడ్, ఇప్ప శంకర్, సీనియర్ అసిస్టెంట్, పెంటు, రెవిన్యూ సిబ్బంది జలంధర్, ఈశ్వర్, సందీప్, రెవంజి, ప్రకాష్ ఆసిఫ్ అలీ, పాల్గొన్నారు.



రెబ్బెన



వాంకిడి



చింతలమానేపల్లి

4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | జూన్ 03, 2024 | www.navatelangana.com

నిరుపేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మందమర్రి



నిరుపేద యువతి వివాహానికి ఫర్ ది పీపుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. శ్రీపతినగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ బాబా తాజుద్దీన్ సఫీయా సుల్తానా దంపతుల కుమార్తె వివాహానికి ఫర్ ది పీపుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దాతలు నుండి సేకరించిన రూ.30వేల నగదు, క్వింటాల్ బియ్యాన్ని యువతి తల్లితండ్రులకు అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు కొమ్ము అనిల్ కార్యదర్శి గుడికందుల రమేష్ ట్రెజరర్ చింతకింది రామకృష్ణ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయి వివాహానికి సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరెన్నో చేపట్టి అభాగ్యులు, అనాధలు, పేద ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బుర్గుల శివ, రాజు పాల్గొన్నారు.

జన్నారంలో ఈదురుగాలులతో వర్షం

● కలమడుగులో పైకాపు లేచిపోయిన ఇల్లు

నవతెలంగాణ-జన్నారం



మండలంలో ఆదివారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. కలమడుగు గ్రామానికి చెందిన సీటబోజు రాజన్న ఇంటి పైకాపు ఈదురు గాలులకు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంట్లో ఉన్న సామాగ్రి వర్షానికి తడిసిందని బాధితుడు తెలిపారు. అలాగే మండలంలోని కవ్వాల్ దేవుని గుడా, కామాన్పల్లి గ్రామాల్లో భారీ వర్షం కురవగా, తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్, మహ్మదాబాద్, తదితర గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. ఈదురుగాళ్లకు అక్కడక్కడ భారీ వృక్షాలు నేలకొరిగాయి.

కార్మిక క్షేత్రంలో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



నస్పూర్‌లో..

నవతెలంగాణ-నస్పూర్

కార్మిక క్షేత్రంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నస్పూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అక్కడినుండి షిర్కే సెంటర్, సీసీసీ, శ్రీరాంపూర్ బస్టాండ్ మీదుగా జీఎం కార్యాలయం వరకు టీ రన్, బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు బతుకమ్మల ఆటపాటలతో చేసిన నృత్యాలు అలరించాయి. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, కార్యాలయం ముందు స్మారక చిహ్నం వద్ద అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. సాయంత్రం ప్రతి స్టేషన్‌లోని స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి శాంతికి చిహ్నంగా బెలూన్లను విడుదల చేశారు. ఉత్తమ ఉద్యోగి, ఇద్దరూ ఉత్తమ సేవా సమితి సభ్యులు, ఇద్దరూ మెడిటోరియల్స్ విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. సాంస్కృతి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఏరియా ఇన్‌చార్జి పెట్టెం లక్ష్మణ్, ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్ పాల్గొన్నారు.



లక్సెట్టిపేటలో..

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సురిమిల్ల వేణు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ వేణు, కమిషనర్ చిట్యాల సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడి నేటితో పదేళ్లు పూర్తి చేస్తుందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో వందలాదిమంది ఉద్యమకారులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.. వారికి ఈ సందర్భంగా నివాళ్లు అర్పించారు. అదేవిదంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా సమితి సభ్యులు కొట్టే కిషన్ రావు, మోత్కూరు కొమరయ్య, దొడ్డిపట్ల రవీందర్, కోడి వెంకటేష్, మండల నాయకులు అల్లా లచ్చిరెడ్డి, కొట్టే శంకరయ్య, మద్రి సందీప్ పాల్గొన్నారు.

జైపూర్ : మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి ఎంపీపీ గోదారి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వనజా రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. భీమారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీడీఓ రాధ రాథోడ్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సదానందం జాతీయ జెండా ఆవిష్కరించారు. జైపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయం ఎదుట మండల పార్టీ అధ్యక్షులు మహ్మద్ ఫయాజోద్దీన్ జాతీయ జెండా ఆవిష్కరించారు.

ఎస్టీపీపీలో...

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్స వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పవర్ ప్లాంట్ జనరల్ మేనేజర్ బసివి రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. తెలంగాణ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తి చేసుకుని 11వ సంవత్సరంలో అడుగిడిన సంధర్భంగా పవర్ ప్లాట్‌లో పండుగ వాతావరణంలో ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో విద్యుత్ ప్లాంట్ సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల పరిషత్ కార్యాలయం వద్ద వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బోజన్న జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, మేరుగు పద్మ చంద్రమోళి, పర్వతి మల్లేశ్, భీంరావు, మాజీ సర్పంచ్ ఆడె బాదు, కోఆప్షన్ సిరాజాఖాన్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, మోటూరి వేణు తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం. వద్ద సహకార చైర్మన్ నీలా రాంచందర్, వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏవో దేవులపల్లి వందన, ఎంఈవో కార్యాలయం వద్ద మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ జెండా ఆవిష్కరణ చేశారు. సోమగూడెం భరత్ కాలనీలో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించగా ప్రమీలాగౌడ్ జెండా ఎగరవేశారు.

లక్సెట్టిపేట : పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని పలు కార్యాలయాల్లో ఆవిర్భవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అన్నం మంగ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పి. చంద్రకుమార్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సరోజ, మండల పంచాయతీ అధికారి విజయ ప్రసాద్, మండల వ్యవసాధికారి ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జన్నారం : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మాదాడి సరోజన, పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజా వర్ధన్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఓ సంగీత, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ విజయ్ కుమార్, ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ ఉమాశ్రీ, పశు వైద్యశాలలో డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు అలీ ఖాన్, పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ పాల్గొన్నారు.



మందమర్రిలో..

మందమర్రి : సింగరేణి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని మందమర్రి ఏరియాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మందమర్రి జీఎం ఏ మనోహర్ హాజరయ్యారు. ఏరియాలోని రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, సూపర్ బజార్ సెంటర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, రామాలయం సెంటర్ తెలంగాణ అమరవీరుల స్తూపానికి నివాళ్లు అర్పించారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయంలో, సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరుల స్థూపం, తెలంగాణతల్లి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ డివైపిఎం ఎండి ఆసిఫ్, ఎస్ఎస్ఓ రవి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు స్థానిక పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం రామాలయం చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో మందమర్రి జనరల్ మేనేజర్ ఎ మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే సూపర్ బజార్ సెంటర్లోని తెలంగాణ తల్లి విగ్రహానికి, రామాలయం చౌరస్తా లోని తెలంగాణ అమరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మున్సిపల్ కార్యాలయంలో

క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.మురళీ కృష్ణ, వైస్ చైర్మన్‌సాగర్ రెడ్డి, రెవెన్యూ అధికారి పి కష్ణ ప్రసాద్‌పాల్గొన్నారు.

వేమనపల్లి : మండల కేంద్రంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వైస్‌ఎంపీపీ ఆత్రం గణపతి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్, నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్యామ్ పటేల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా రాజేష్ జెండా ఆవిష్కరించారు.



రామకృష్ణపూర్‌లో..



వేమనపల్లిలో..



జన్నారంలో..

పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత

● ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన కార్యదర్శి



నవతెలంగాణ-జన్నారం

మొక్కలు నాటాల్సింది పోయి పల్లె ప్రకృతి వనంలోని చెట్లను నరికి వేస్తున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రాంపూర్ పల్లె ప్రకృతి వనంలోని 500 చెట్లను ఇద్దరు వ్యక్తులు నరికివేశారు. వీటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని, పల్లె ప్రకృతి వనంలో సుమారు 2000 నీలగిరి, కానుగ, అడవి తంగేడు, ఇతర పండ్ల మొక్కలు నాటారు. గత కొంతకాలంగా ఆ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అదును చూసి ఆ చెట్లను నరికి వేస్తున్నారు. తాజాగా సుమారు 200 చెట్లను నరికి వేశారు. ఇదే పల్లె ప్రకృతి వనంలో గతంలోనూ 300 చెటను నరికి వేసినటు తెలుస్తోంది. ఈ విషయమై గ్రామ కార్యదర్శి నలిమెల వెంకటి, స్థానిక ఎంపీడీఓ ఠాగూర్ శశికళకు, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి, ఎంపీఓ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆ చెట్లను నరికి వేస్తున్నారని కార్యదర్శి ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తహసీల్దార్ తెలిపారు. విచారణ జరిపి ఆ ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వమని కార్యదర్శికి సూచించామన్నారు.

ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని బుగ్గగూడలో గాలి దుమారానికి సంద్ర రాజక్కమల్లయ్య ఇంటిపై చెట్టు విరిగి మీద పడటంతో ఇంటి రేకులు పూర్తిగా విరిగిపోయాయి. ఇంటికి సంబంధించిన వస్తువులు దెబ్బతిన్నాయి. సంబంధిత మండల అధికారులు పర్యవేక్షించి, విచారణ చేసి నష్టపరిహారం అందించాలని బాధితురాలు కోరారు.

మంచిర్యాలలో మరో గ్యాంగ్‌వార్



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో గత నెలలో అంబేద్కర్ చౌరస్తాలో అర్ధరాత్రి పట్టణానికి చెందిన ఒక యువకుడిపై మరి కొందరు యువకులు గ్రూప్‌లుగా ఏర్పడి మద్యం మత్తులో దాడి చేసిన ఘటన విషయం తెలిసిందే. ఇది మరువక ముందే ఆదివారం ఉదయం లక్ష్మి టాకీస్ చౌరస్తాలో పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడిపై జరిగిన దాడి తీరు జిల్లాలో సంచలనంగా మారింది. మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గడప రాకేష్ ఇంటి నుండి ఉదయం జిమ్ కు వెళ్ళే సమయం లో దాదపు 10 మంది గుర్తు తెలియని వ్యక్తులు అతడి వాహనాన్ని అడ్డుకొని క్రికెట్, గోల్ఫ్ ఆట ల్లో ఉపయోగించే బ్యాట్స్, వికెట్స్ తో రాకేష్ పై విచక్షణ రహితంగా దాడి చేశారు. వాహనాన్ని ధ్వంసం చేశారు. గమనించిన స్థానికులు బాధితుడిని మంచిర్యాలలో గల ప్రైవేట్ హాస్పటల్ కు తరలించారు.సమాచారం తెలుసుకున్న మంచిర్యాల మాజి ఎమ్మెల్యే దివాకర్‌రావు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించి దాడిని ఖండించారు. గత కొన్ని రోజులుగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, రాకేష్ అంతు చూస్తానని పలు సందర్భాల్లో అందరి ముందే మాట్లాడినట్లు, అందులో భాగంగానే ఈ రోజు రాకేష్ పై దాడి జరిపారని దివాకర్‌రావు ఆరోపించారు. మంచిర్యాల కు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి తన దగ్గర ఉండే యువకులతో తన పై దాడి చేయించినట్లు రాకేష్ తెలిపారు. బాధితుడు ఒక వీడియో విడుదల చేశారు. మంచిర్యాల పట్టణ సీఐ బన్సిలాల్,పట్టణ ఎస్ఐ లు , హాస్పిటల్ కు చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సిలాల్ తెలిపారు.

సింగరేణీయులతోనే ఉద్యమం ఉధృతమైంది

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికులు ఉద్యమంలో పాల్గొన్న తర్వాతే పోరాటం మరింత ఉధృతమైందని సింగరేణి సీఎండీ బలరామ్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి వ్యాప్త కార్మికులకు, ఉద్యోగులకు, అధికారులకు రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి దేశంలో ఒక అగ్రగామి రాష్ట్రంగా నిలుపడానికి అందరూ కృషిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వం దిశానిర్దేశంలో మన సంస్థ అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ ముందుకు పోతుందన్నారు. కాగా సింగరేణి సంస్థ ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని, బొగ్గు రవాణాను సాధించిందన్నారు. రూ. 37,500 కోట్ల టర్నోవర్‌ను గడించి సరికొత్త రికార్డును సృష్టించిందని గుర్తుచేశారు.

విత్తన దుకాణాల తనిఖీ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారిని వందన, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ముత్యంపల్లి, కొండాపూర్ గ్రామంలోని విత్తన దుకాణాల్లో తనఖీలు నిర్వహించి స్టాక్ వివరాలు, విత్తన నిల్వలు పరీక్షించారు. ప్రతి డీలరు రోజు వారి విత్తన లభ్యత అందుబాటు తదితర వివరాలు పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అమ్మే విత్తనాల వివరాలు ప్రతి రైతు వారిగా ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేయాలని, రైతులకు రసీదులు తప్పని సరిగా ఇవ్వాలని, రోజువారి స్టాక్ వివరాలు వ్యవసాయ అధికారులకు తెలియచేయాలని తెలిపారు. విత్తన కొరత లేకుండా రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. లూజు విత్తనాలు, కాల పరిమితి చెల్లని విత్తనాలను అమ్మరాదని సుచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమ్య పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు పురస్కారం

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ విధులు నిర్వహిస్తున్న శ్యాం పటేల్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం కమిషనరేట్‌లో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా సీపీ శ్రీనివాసులు చేతులమీదుగా ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నారు.

సమగ్ర అభివృద్ధికి కృషి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ● కలెక్టరేట్‌లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

స్వరాష్ట్రంలో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అధికారికంగా కలెక్టరేట్ ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళ్లు అర్పించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. నస్పూర్‌లోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అవతరణ వేడుకలల్లో పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మహాత్మాగాంధీ, డా.బీఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాల వేసి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని అర్హత గల ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం పారదర్శకంగా పని చేస్తోందని, అన్ని సామాజిక



వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలు, అన్ని రంగాలకు సమప్రాధాన్యత ఇస్తూ సమగ్రాభివద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, డీసీపీ అశోక్ కుమార్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి రాములు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళ, ఏసీపీ ప్రకాష్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఎంపీ అభ్యర్థి సుగుణ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ గ్రామంలోని ఇందూరు పోచమ్మ ఆలయంలో ఆదివారం ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తన కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఎంపీ సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ సిద్ధించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఉద్యమాభివందనాలు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సామూహిక సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం ప్రకారం, ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో తొలి చిరు జల్లు కురవడంతో గ్రామస్తులతో కలిసి అమ్మవారికి సాంప్రదాయ పూజలు చేసినట్లు సుగుణక్క తెలిపారు. పాడి



పంటలు సమద్ధిగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వెడుకున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన తోనూపు నిఖిల్ ఇటీవల మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ గొడం నగేష్ పరామర్శించి ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చేతికి అందిన కొడుకు మృతి చెందడం తల్లీ దండ్రులకు తీరని దు్ఃఖం అన్నారు. కని పెంచిన తల్లి దండ్రులకు కడుపు కోత మిగిల్చి ఇలా ఆవేశంలో ఆత్మహత్యలకు పూనుకోవడం మంచిది కాదన్నారు. ఏదైన సమస్య వస్తె కుటుంబ సభ్యులకు స్నేహితులకు చెప్పుకోవాలని అన్నారు. కానీ ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. కుటుంబ సభ్యులు మనో ధైర్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు నారాయణ, సదానందం ఉన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తెలంగాణా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ హయంలో చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ స్వప్నం సాకారం కావడం కోసం గులాబి అధిపతి కేసీఆర్ అనేక పోరాటాలు చేశారని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అమరవీరుల ఆకాంక్షలను ప్రతిబింబించేలా స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన సాగిందని అన్నారు.

సంక్షేమం..అభివృద్ధికి పెద్దపీట

- పరిపాలనలో పారదర్శకత, జవాబుదారితనం
- ఆరు గ్యారెంటీల అమలు ద్వారా అర్హులకు లబ్ధి
- రైతాంగం కోసం సరికొత్త ప్రణాళిక
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఉట్నూర్ : ఐటీడీఏలో..



తాంసిలో..

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం..అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని..పరిపాలనలో పారదర్శకతతో పాటు జవాబుదారితనంతో ఉండే ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించి పదేండ్లు నిండిన సందర్భంగా దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాల పునాదుల మీద రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు నిరంతరం కృషిచేస్తోందని ప్రస్తుతం ప్రజాపాలన కొనసాగుతోందని వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. ఇప్పటికే వివిధ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తోందని ఇప్పటికే రాష్ట్రంలో 29,384 ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర రైతాంగం కోసం ప్రభుత్వం సరికొత్త ప్రణాళిక రూపొందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్లు శ్యామలదేవీ, డీఎఫ్ఓ ప్రశాంత్‌బాజీరావుపాటిల్, ఆర్డీఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఇదిలా ఉంటే అటూ కోర్టు ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావ్ మహానీయుల చిత్రపటానికి పూలామలలు వేసి, జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కు రక్షణతో పాటు ప్రతి ఒక్కరికి న్యాయం అందించేలా కృషి చేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్ అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

పోరాడి సాధించిన తెలంగాణను గత ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం తెలంగాణ 10వ ఆవిర్భావ వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కమిషన్ ఖమర్ అహ్మద్‌తో కలిసి మహానీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అక్కడి నుంచి కార్గిల్ పార్కు అమరవీరు స్థూపం వద్ద పులమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ చౌక్‌లోని అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి సమర్పించి అమరు వీరుల త్యాగలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ తిరుపతి, కౌన్సిలర్లు అశోక్ స్వామి, బండారి సతీష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, ఆర్ఐ జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

మరో పక్క సీపీఐ ఆధ్వర్యంతో తెలంగాణ ఆవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో అమరవీరుల స్థూపానికి పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నళిని రెడ్డి, అరుణ్, కుంటాల రాములు, ఆమీన పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంక్‌లో...

ఇదిలా ఉంటే అటూ డీసీసీబీ బ్యాంక్‌లో జరిగిన అవతరణ వేడుకల్లో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి పాల్గొన్నారు. బ్యాంక్ అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అంతకు ముందు మహానీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో

మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి ఘన విజయం సాధించడంతో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నాయి. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నాయకులు టపాసులు పేలుస్తూ సంబరాలు జరిపారు. ఈ సంబరాల్లో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల స్వీట్లు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రజల్లో వ్యతిరేకతను మూట కట్టుకుందని, అందుకు తాజాగా వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ సమయంలో వందలాది మంది విద్యార్థుల బలిదానానికి కారణం కాంగ్రెస్ పార్టీనేనని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల ఫలితాలతో పాటు రానున్న అన్ని ఎన్నికల్లోనూ గులాబి జెండా రెపరెపలాడనుందని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, జెడ్పీటీసీ సుధాకర్, కౌన్సిలర్లు భూమన్న, పండ్ల శ్రీనివాస్, అశోక్ స్వామి, లస్మన్న, దాసరి రమేష్, ఆశన్న, రాము, నీరటి ఉదయ్, తులసి, కరుణ పాల్గొన్నారు..

తాంసి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం తాంసి, భీంపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవతరణ దినోత్సవ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు, తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్లు మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తివర్ణ పథకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాధన కోసం అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రవీందర్, ఎస్సై శివరాం, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాలగంగాధర్, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం సంతోష్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి అరుణ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బియ్యాల మల్లేష్‌లు జెండా ఆవిష్కరణ చేశారు. ఎందరో తెలంగాణ అమరుల త్యాగ ఫలితమే ప్రత్యేక రాష్ట్రమని పలువురు కొనియాడారు.

నేరడిగొండ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సంతోష్‌రెడ్డి మువ్వన్నెల జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీఓ రాజ్‌వీర్, డిప్యూటీ తహసీల్దార్, ఏపీఓ వసంత్, ఏపీఎం, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, వడూర్ ఎంపీటీసీ పందరి, ఆయా మండల నాయకులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : మావల ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమర వీరుల త్యాగఫలమే సాధించుకున్న తెలంగాణ అని అన్నారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్, అంబేద్కర్, చిత్రపటాలకు పూలమాలు లేసి నివాళులర్పించారు. మావల, బట్టి సవర్గాం, వాఘాపూర్ గ్రామపంచాయతీలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, గోనె ప్రనూష, ఏపీఓ మాధురి, అమ్ముల ధర్మేందర్, కొంతం శంకర్, రజిని, టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలో..

ఆదిలాబాద్ మండల కేంద్రంతో పాటు 34 గ్రామపంచాయతీలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగం ఫలమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బిక్కి గంగాధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం జెండా ఆవిష్కరించారు. ఆయా గ్రామపంచాయతీలలో పంచాయతీ సెక్రటరీలు, జాతీయ జెండా ఆవిష్కరించారు.

నార్నూర్ : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు. వివిధ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో కళాశాలలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు జెండాను ఎగురవేశారు. తాడిహత్నూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన వార్షికోత్సవం సందర్భంగా వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ మధుకర్ రాథోడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేంద్రే సంతోష్, ఉద్ధవ్, విఠల్, గణేష్, బాలాజీ, జాదవ్ విలాస్, జితేందర్, శివాజి మహారాజ్ గ్రామయూత్ ప్రెసిడెంట్ ఫడ్ రవీందర్, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ హజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనేక మంది అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. వారి త్యాగాలను స్మరించుకుందామని అన్నారు. హైదరాబాద్ వేడుకల్లో మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు యుర్వేత రూపదేవ్, మండల కార్యదర్శి ఖాసీం, కనక ప్రభాకర్, మండల యువ నాయకులు ఫడ్ విష్ణు ఉన్నారు.

జైనథ్ : మండల కేంద్రంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ : అమరవీరుల స్తూపం వద్ద

ఉట్నూర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఆదివారం ఎగుర వేశారు. అనేక మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, వారి త్యాగాలను గుర్తు చేసుకుందామని అన్నారు. అమర వీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు గ్రామపంచాయతీ ఈఓ శంకర్, మండలంలోని ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ, అటవీశాఖ, పోలీసు, గ్రామపంచాయతీల్లో జాతీయ జెండాను అధికారులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ తెలంగాణ అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ కలను సాకారం చేసిన కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి ఈ సందర్భంగా సుగుణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ లింగంపల్లి చంద్రయ్య, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అచ్చ దేవానందం, మైనారిటీ మండల అధ్యక్షుడు ఎస్.కె సలీం, సీనియర్ నాయకులు హర్షద్, అజీమ్, నిసార్, ఇమ్రాన్, జుబేర్ ఖాన్, రాజేష్, భీమన్న, ముకుంద్, మహిళ నాయకురాళ్లు రాధాబాయి, నీలాబాయి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను తహసీల్దార్ మోతీరాం ఎగరవేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, పోలీసు స్టేషన్‌లో ఎస్సై, తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్ర కోసం అమరులైన వారి త్యాగాలను అందరూ స్మరించుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి(బి), పల్సి, సోనారి, గోడపూర్, తదితర గ్రామంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ తల్లీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జెండా ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, చంద్రకాంత్, వైద్యాధికారి విశ్వజీత్, సరోత్తమ్, ఎస్సై రవీందర్, ఆయా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తెలంగాణవాదులు, మండల నాయకులు ఉన్నారు.

సారంగాపూర్ : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, పంచాయతీల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. మండల ప్రజలకు రాష్ట్ర అవతరణ శుభ కాంక్షలు తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ ఆడే సవిత బాయి, తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ శ్రీదేవి, ఎమ్మార్సీలో ఎంఈఓ మధుసూధన్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై చంద్రమోహన్, పీహెచ్‌సీలో డా.వేదవ్యాస్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గోపికృష్ణ, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, వివిధ పార్టీల కార్యాలయాల్లో అద్యక్షులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయ జెండాను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య ఎగురవేశారు.మండల ప్రజలకు రాష్ట్ర అవతరణ శుభ కాంక్షలు తెలిపారు. ముందుగా డా.బీఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి, చాకలి ఐలమ్మ కుమురంభీమ్ విగ్రహాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం సీఎం రేవంత్ నేతృత్వంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆడే సవిత బాయి, ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విలాస్‌రావు, నాయకులు నారాయణరెడ్డి, రాజ్ మహమ్మద్, హాదీ, సత్యపాల్‌రెడ్డి, జగదీశ్వర్, లక్ష్మణ్, పోతన్న, భూమన్న, చిన్నయ్య, తేజు, భీమ్‌రావు, సలీం, ఈశ్వర్, లస్మయ్య రాజన్న, నాగన్న, సత్యం పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధోనికేని దయానంద్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం, మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ కావాలి సంతోష్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మజీద్, కౌన్సిలర్ అంకం రాజేందర్, మైనార్టీ సెల్ మండల, పట్టణ అధ్యక్షులు సలీం ఖాన్, శౌకత్ పాషా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కదర్ల గంగ నర్సయ్య పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విఠల్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అఫ్రోజ్ ఖాన్, ఎమ్మార్సీలో ఎంఈఓ మైసాజి, ముథోల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ రంగా జాదవ్, తో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీలో స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, ఎంపీడీఓ రాములు నాయక్, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్



లోకేశ్వరం..



జైనథ్



నేరడిగొండ



ఖానాపూర్



ముథోల్